కథానిక

# యథార్థవాదులు

ద్రోణంరాజు కృష్ణమోహన్

మావూరి ప్రజల గొప్పతనాన్ని గురించి వివరించేముందు, కొంచెం జనాభా వివరాలు వగైరా చెప్పదలచుకున్నాను. ఈ సోది అంతా ఎందుకు? అని మీరు విసుక్కోవచ్చు. కాని మనల్నందర్నీ యిప్పుడు పీక్కుతినేది ఎలక్షన్ల గొడవొకటుంది గదండీ మరి! అందుకని ఆ గొడవకు సంబంధించే యీ క్రింద నేను వ్రాసేది.

యీవూరి జనాభా సుమారు రెండువేలు. పట్టభద్రులు నలుగురు, మెట్రిక్యులేట్స్ ఆరుగురు, ఇంటర్ ఢింకీలుకొడుతూ ప్రయాణం సాగిస్తున్నవారు ముగ్గురు. అది ప్యాసై కూర్చున్నవారు యిద్దరువున్నారు. కొందరు ఎలిమెంటరీస్కూలు నడుపుతున్నారు. కొందరు వయోజనులకు రాత్రి పాఠశాల నడుపుతున్నారు. ఇంచుమించు వీరంతా భిన్నభిన్న రాజకీయ పక్షాలకు చెందినవారు. ఇద్దరో ముగ్గురో ఎటూతూగక,అందర్నీ తిడుతూవుంటారు. ఒక చిన్న లైబ్రరీవున్నది. అంతా అక్కడచేరి బాతాఖానీ కొడుతూవుంటారు. సినిమాలు, రాజకీయాలు, ప్రేమ, సాహిత్యం వగైరా చర్చిస్తూవుంటారు. అందరూ మధ్యతరగతికి చెందినవారు. ఊళ్లో కాస్తయిల్లు, కొద్దిగా పొలం వున్నవాళ్లు. గ్రామంలో పెద్దలది రాజ్యమైనా, ఎన్నికలొచ్చేసరికి పెద్దలంతా యుద్ధాలకు దిగుతారు యీ కుర్రాళ్లు చెప్పిందివిని. ఈమాటు కొందరు "ఈసారి కమ్యూనిస్టులసలు యీ వూళ్లోకి రావడానికి వీల్లేదు." అనీ, కొందరు "ఈసారి కాంగ్రెసువాళ్లని అసలు పొలిమేరలవుంచే అవతలకు పంపాలి" అనీ నిర్ణయించారు. కుర్రాళ్ళంతా ముఠాలుగా చీలిపోయారు. ఇదేదో చాలా ప్రమాదకరంగా పరిణమించేట్లుందనుకున్నారు జనం.

ఒకరోజు సాయంత్రం వూళ్లో ఫలానారోజున కమ్యూనిస్టుల ఎన్నికలసభ జరుగుతుందని ప్రకటించబడింది. కాంగ్రెసువాళ్లు కూడ తమ సభ అదే రోజు అదే టైములో జరుగుతుందని ప్రకటించారు. రానివ్వకూడదనుకున్న నిర్ణయాలు మార్చుకున్నారు. స్థలందగ్గిర పేచీవచ్చిందిగాని రాజీపడ్డారు. ఆరుగంటలనుంచి ఎనిమిది వరకు కమ్యూనిస్టులది, తరువాత కాంగ్రెసు వాళ్ళదీ జరగాలని అంగీకరించారు.

ఆరోజు కమ్యూనిస్టుల వూరేగింపు చాలా అట్టహాసంగావుంది. 100 సైకిళ్ళ కార్యకర్తలు వచ్చారు. తప్పెట్లు, వాయిద్యాలు, మ్రోగించుకొంటూ వచ్చారు. వాగుగట్టువద్ద వూళ్లో కమ్యూనిస్టులు ఎదురెళ్ళి స్వాగతమిచ్చారు. కాంగ్రెసువాళ్లు రంగురంగుల వేషాలతో, గాంధీ నెహ్రూల పటాలతో బళ్ళమీద వచ్చారు. కమ్యూనిస్టు సభ ప్రారంభమైంది. నియోజకవర్గ అభ్యర్థి అధ్యక్షత వహించారు. ఆయన్ని పరిచయంచేస్తూ తాలూకా నాయకుడు ఐదు ముక్కలు చెప్పాడు. అందులో మూడుమాటలు కుళ్ళిపోయి కంపుకొడుతున్న కాంగ్రెసు, బూజుపట్టిన జమీందారీవర్గం, రక్తం తాగుతున్న పెట్టుబడిదార్లు, నాలుగోమాట నవచైనా, రష్యాల భూతలస్వర్గాలు, ఐదవమాట వక్కటే ఆయన్ని గురించి-అది ఆయన పేరు 'ఫలానా' అని, అభ్యర్థి తన ఉపన్యాసం మొదలెట్టాడు.

"సోదర సోదరీమణులారా! నేడు బ్రహ్మాండమైన పోరాటం జరుగుతోంది. ఆంధ్ర ప్రజల తీర్పు కోసం యావత్తు ప్రపంచం ఎదురుచూస్తోంది. ఈ కాంగ్రెసువాళ్లని, యీ జమీందారీ, భూస్వాముల, పెట్టుబడిదార్ల ముఠాని బయటపెట్టింది మొదటిసారిగా కమ్యూనిస్టుపార్టీయే. అందుకనే వీళ్లు అసూయచెంది, ప్రజలశక్తికి భయపడి తెలంగాణా, ఆంధ్రలలో ఘోరనిర్బంధ విధానం సాగించారు. ఎందరినో పొట్టనపెట్టుకున్నారు. ఎందరి స్త్రీల పసుపు కుంకుమ చెరిపివేశారో యీ హంతకులు."

"మరెందరి పసుపు కుంకుమ చెరిపేశారు?" అని సభలోనుంచి ప్రశ్న!

అభ్యర్థి కొనసాగించాడు ఉపన్యాసాన్ని.

"అదే చెపుతున్నా, మధ్యలో ప్రశ్న లెయ్యొద్దు. మామీద ఎప్పుడయితే అక్రమంగా, అన్యాయంగా, తుపాకులు గురిచేశారో, అప్పుడు ఎదురుతిరిగిన మాట వాస్తవమే. కొందర్ని చంపాము, అయితే, అమాయకులను కొన్నిచోట్ల చంపినందుకు గత ఎన్నికలనాడే క్షమార్పణ కోరుకున్నాము. మేము కోరుకున్నదంతా ఆత్మరక్షణమాత్రమే. కాటూరు, ఎలమర్రులలో జరిగిన ఘోరాలు, జైళ్లలో జరిగిన కాల్పులు యివన్నీ ఎన్నడైనా మరువగలమా?"

"మీరు చేసిందిమాత్రం మరువగలమా?" అని సభలో ఒక మూలనుంచి ప్రశ్న.

అభ్యర్థి అటువైపుతిరిగి, "దయయుంచి, వుపన్యాసాని కడ్డురావద్దని చెపుతున్నా. కాగితంమీద వ్రాసిపంపండి. లేకపోతే అట్టివాళ్ళని బయటకు పంపెయ్యాల్సొస్తుంది." అన్నాడు. ఈ మాట అవగానే ఒకమూల ఒక గుంపులేచి నిలబడింది. కొంచెం వాగ్వివాదం జరిగింది. కాని సర్దుబాటు చేశారు. తిరిగి అంతా కూర్చున్నారు. అభ్యర్థి తిరిగి ప్రసంగించాడు.

"రాజధాని, హైకోర్టు, నందికొండ, తుంగభద్ర గురించి మేమెంత పోరాడామో మీకు తెలుసు. ఈనాడు కాంగ్రెసువాదులు ప్రభుత్వం పెద్దపెద్ద ఫ్యాక్టరీలు, ప్రాజెక్టులు, నిర్మిస్తోందని చెపుతున్నారు. కాని యిదంతా ఎవరికోసం? టాటా బిర్లాలకోసం! ప్రజలకోసం, కాదు. కాని రష్యా, చైనాలలో జరిగే అభివృద్ధి ప్రజలందరి కోసం. కనుక అట్టిప్రభుత్వం రావాలంటే, భూమిలేని పేద రైతులకు, వ్యవసాయ కూలీలకు, చైనాలోలాగ భూమి లభించాలంటే, కమ్యూనిస్టు పార్టీకే వోటివ్వండి. నిరుద్యోగులైన విద్యావంతులకు చైనా రష్యాలోలాగ జీవనోపాధి కల్పిస్తాం. కనుక కంకి కొడవలి గుర్తుగల పెట్టిలోనే వోటువేయండి.

ఈనాడు నాపై పోటీచేస్తున్న కాంగ్రెసు అభ్యర్థి ఎన్నిరంగులు మార్చాడో మీకు తెలియనిది కాదు. ఇలారంగులు మార్చే రంగళ్ళకి మోసపోయి వోట్లువేయండి" అంటూ వుపన్యాసం ముగించాడు. మరోయిద్దరు భూతల స్వర్గాల గురించి గొంతుచించుకుని, దగ్గొచ్చి, ఒక్కొక్కళ్లు మూడున్నరగ్లాసుల "అర్థణా, అర్థణా" స్పెషల్ వెరైటీ లైంజూసు తాగి, అప్పటికి శాంతించారు. తరువాత బుర్రకథ దళం ప్రోగ్రాం జరిగింది. అప్పటికే జనం ఇళ్ళకు వెళ్ళారు భోజనాలకి. భోంచేసి తిరిగి కాంగ్రెసు వాళ్ళసభ ప్రారంభ మయ్యేసరి కొచ్చారు. జాతీయగీతంతో సభ ప్రారంభమైంది. నియోజక వర్గ అభ్యర్థిని పరిచయంచేస్తూ సెకండు ఫారం బండిలో ప్రయాణంచేసి అలిసిపోయిన స్థానిక నడివయస్క, ఛోటాకాంగ్రెసు నాయకుడిలా ప్రసంగించాడు.

"ఆర్యమహాజనులారా! కాంగ్రెసు తల్లిసంస్థ. మనమంతా బిడ్డలం. భారతదేశమాత పుత్రులం. కమ్యూనిస్టులు రష్యాపుత్రులు వాళ్లు తెలంగాణంలో దేశద్రోహం చేశారు. చాలామందిని నరికేశారు. అచ్చంపేటలో ఆడపిల్లనిచంపారు. మన నెహ్రూగారు చాలగొప్పోడు. చింద్రి పేటరీ నిరిమించాడు. ఇందూస్తాన్ ఏరోడమ్ములో 'ఎచ్ టు' భారతదేశ ప్లేనులు కట్టించాడు. టీల్ అంటే వుక్కు పేకట్రీ వొస్తావుంది..."

"సింద్రి ఎక్కడ?" సభలోనుంచి ప్రశ్న. వక్తగారు అమాంతంగా బుర్రగోక్కుని అభ్యర్థి వైపు చూశాడు గొణుగుతూ. "బీహారు అనవయ్యా" అని రహస్యంగా చప్పునచెప్పాడు. వెంటనే వక్తగారు సభికులవైపుతిరిగి, "బీగారుదేశంలో..." సభికులు కొందరు ఒకమూల గొల్లున నవ్వారు.

"ఇలా అడ్డుపెడితే మర్యాదగాదు. అట్టా కొచిన్ లెయ్యగూడదు." అంటూ వక్తగారు మళ్ళీ సాగించ్చాడు. కమ్యూనిస్టుల దేశద్రోహం గూర్చి, వందసార్లు చెప్పిందేచెప్పి చట్టచివరకు

అభ్యర్థి పేరుచెప్పి ఆయనకు వోటేసి "డిమాక్రసీని" రక్షించమని చెప్పాడు.

అభ్యర్థి తన వుపన్యాసం మొదలెట్టాడు.

మహాజనులారా!

నన్ను గురించి వేరే చెప్పుకోవాల్సిన పనిలేదు. మీకు తెలుసుగదా నేనసలు మొదట్లో కాంగ్రెసువాదినేనని, రెండుసార్లు జైళ్ళకెళ్ళాననీ. అయితే, కాంగ్రెసు కొన్నికారణాలవల్ల కుళ్ళిపోయినందున, నేను బయటికివచ్చి మన ఆంధ్రకేసరి స్థాపించిన ప్రజాపార్టీలో చేరాను. అది ప్రజాసోషలిస్టు అయింది. అయితే ఆంధ్రదేశ ప్రత్యేకపరిస్థితులను అర్థంచేసుకోలేక ఎప్పుడయితే పార్టీ పప్పులోకాలేసిందో అప్పుడే దాంట్లోంచి విడిపోయి విశ్వనాథంగారి ప్రజాపార్టీలో చేరాను. అయితే, కమ్యూనిస్టుల దేశద్రోహ విధానాలను గుర్తించికూడా మా పార్టీ కాంగ్రెసులో ఎప్పుడయితే చేర నిరాకరించిందో, అప్పుడే ఆంధ్రకేసరితోపాటు, నేనూ కాంగ్రెసులో చేరాను. ఇప్పుడు కాంగ్రెసు బాగుపడింది. ఇది మన మాతృసంస్థ. కాంగ్రెసు అంటే ప్రజలు. ప్రజలుఅంటే మీరు. మీదగ్గరకి మళ్ళీవచ్చానన్నమాట...

"ఇన్నాళ్ళు మమ్మల్ని వొదిలి దూరంగావెళ్ళారన్నమాట!" అని సభలో ఒకమూల ఒక కంఠం అరిచింది. అభ్యర్థిగారి గొంతుకలో పచ్చి వెలక్కాయ పడినట్లయింది. కాస్త తేరుకుని చప్పున,

"ఇదుగో చూశారా! ఇదే కమ్యూనిస్టుల రౌడీ చర్యలంటే!" అన్నాడు.

"నేను కమ్యూనిస్టునుగాను. కాంగ్రెసువాదిని మొదటినుంచీ యిప్పటివరకు" అని సమాధానం! అభ్యర్థికి ఏంచెప్పాలో తోచలేదు! అయినా, "మంచిదే, కాని నువ్వుచెప్పిన ధోరణి అలావుంది" అని మళ్ళీ సాగించాడు.

"ఈనాడు బ్రహ్మాండమైన ప్రాజెక్టులు, ఫ్యాక్టరీలు నిర్మించుకొంటున్నాం. నందికొండ, తుంగభద్రలు వచ్చేస్తున్నాయి. వొచ్చేప్లానులో రామపాదసాగరు తప్పదు. వంశధార నిర్మిస్తాం బంజర్లు పంపిణి ప్రారంభించాం..."

"మీరిచ్చిన బంజర్లు ఎవరికి?" సభలోనుంచి ఒక కమ్యూనిస్టు ప్రశ్న! ఉపన్యాసకుడు మండిపడ్డాడు.

• "సభను భగ్నంచేసే వాళ్ళని బయటకు తోసెయ్యండి." అని ఆజ్ఞాపించాడు. వాలంటీర్ల జండా కర్రలు లేచాయి. కాని జనం యువతలకు లాగి ఇద్దర్నీ శాంతపరిచారు. ఉపన్యాసం కొనసాగింది.

"సోదరులారా... యీ కమ్యూనిస్టుల దేశద్రోహ, జాతిద్రోహచర్యలనుచూసి నేను, "డెమోక్రసీ," అంటే ప్రజాస్వామ్య రక్షణకుగాను జాతి రక్షణకుగాను, కాంగ్రెసులో చేరాను. నాబోటివారు లేకపోతే కాంగ్రెసు పెట్టుబడిదార్ల సంస్థ అయ్యేది. అలాకాకుండా దానిని బాగుపరిచాను. కమ్యూనిస్టులు పదవీవ్యామోహపరులు. ఈ మాస్కోమానస పుత్రుల ప్రచారం నమ్మకండి. నన్ను రంగులుమార్చేవాడిగా ప్రచారం చేస్తున్నారు ఇదంతా అబద్ధం. కేవలం దేశక్షేమం ఎవరు కోరుతున్నారో చూద్దామని అందరిలోనూ చేరి, చివరకు కాంగ్రెసే నిజమైన జాతీయసంస్థయని గుర్తించి అందులో చేరాను. అయినా యితరులతో అంటే ప్రజా, లోక్, పార్టీలతో మాకు పోట్లాటల్లేవు. వాళ్లు మేమువకటే...

"కొద్దిగా సీట్లపంపిణీదగ్గిరే భేదం" ఒకమూల గొణుగుడు. ఉపన్యాసకునికే మాటలు స్పష్టంగా వినిపించలేదు. అటు తిరిగిచూసి, మళ్ళీ వుపన్యాసం సాగించాడు. కమ్యూనిస్టుల దేశద్రోహం, జాతిద్రోహం, నెహ్రూ గొప్పతనం, గాంధీగారి నామస్మరణ, తప్ప వేరే విషయాలేవీ లేవు అందులో. తరువాత ప్రజాపార్టీలో పార్టీనాయకులు ప్రసంగించారు.

"ప్రజాస్వామ్యం రక్షింప బడాలంటే శ్రీ... గారికే మీ వోటివ్వండి...పాపం చాలా పొద్దుపోయింది. ఇకమిమ్మల్ని శ్రమపెట్టదలచుకోలేదు." యీ రెండేముక్కలు వాళ్ళుచెప్పింది. తర్వాత ఒక నాటిక ప్రదర్శించారు. జనం చాలాభాగం వెళ్ళిపోయారు నాటికి మొదలయ్యేసరికే పదకొండు దాటింది. రాత్రి ఒంటిగంటకి నాటిక పూర్తయింది.

మర్నాడు ప్రొద్దున్నే గ్రామంలో సోషలిస్టు అభిమానులు సైకిళ్ళమీద చుట్టుప్రక్కల గ్రామాల కెళ్ళి ఒక యాభైమందిని పోగు చేసు కొచ్చి సాయంత్రం ఆరుగంటలకి సభ ప్రారంభించారు. నిజం చెప్పొద్దూ; ఏమాటకామాటే! ఆ వొచ్చిన యాభై, వూళ్ళోవాళ్ళొక 50 మొత్తం 150

తప్పితే ఎక్కువలేరు ఆ మీటింగులో. ప్రజాసోష సిస్టు నాయకుడు ప్రసంగించడం మొదలెట్టాడు.

"మేము మొదటినుంచీ మధ్యే మార్గవాదులం. అటు రష్యా, అమెరికా, రెండూ వద్దంటున్నాము. మూడో పంథా కావాలి. ఇది రెంటికీ మధ్యగా పోతుంది. మాది నిజమైన సోషనిజం. ప్రజాసోష నిజం!" అంటూ నాలుగు ముక్కలుచెప్పి వాళ్ళ వాళ్ళు సాగించిన "కరివెన ఇనాం సత్యాగ్రహం" గురించి వర్ణించాడు.

రెండు రోజులైన తర్వాత కమ్యూనిస్టుల పత్రికలో "...గ్రామంలో 2500 మందితో బ్రహ్మాండమైనసభ! గ్రామప్రజల అఖండస్వాగతం" అనే శీర్షికక్రింద "సభలో కాంగ్రెసుముఠా విచ్ఛిన్న చర్యలు, సభను భంగం చేయాలని ప్రయత్నం. సభపైరాళ్ళు, చెప్పులు విసరారు" అని వ్రాశారు. "అసలు కాంగ్రెసు మీటింగు కొచ్చింది రెండు వందలు మాత్రమే." అని కూడా వ్రాసుకున్నారు. "ఈమాటు కాంగ్రెసుకి సమాధికడతామనిగ్రామస్థులంతా హామీనిచ్చారు"అని ఇంకా చెప్పుకున్నారు పత్రికలో.

సరిగా అదేరోజు కాంగ్రెసు పత్రికలలో, "...గ్రామంలో వేలమందితో బ్రహ్మాండమైనసభ! కమ్యూనిస్టుల కంచుకోట బ్రద్దలైనది!" అనే శీర్షిక క్రింద "సభలో కమ్యూనిస్టు గూండాలు రౌడీ చర్యలు జరిపారు. ఇద్దరు బాలురతలలు పగిలాయి. ప్రజలు తగినబుద్ధి చెప్పారు. ఈమాటు కాంగ్రెసుకే మా వోటని హరిజనులు కూడ వాగ్దానంచేశారు." అని ఒక "కాలం" వార్త వ్రాసుకున్నారు.

ఆహా! ఎంతవిచిత్రం! నిజానికి రెండు మీటింగులకే హాజరైన జనం సమంగానే వున్నారు. ఐదు వందలు వీళ్ళమీటింగుకీ, ఐదు వందలు వాళ్ల మీటింగుకీ వచ్చారు. రెండు వూరేగింపుల్లోను వచ్చినవాళ్లు వందకంటె ఎక్కువలేరు. గ్రామ ప్రజల్లో ఏ పక్షానికి చెందినవాళ్లు ఆ పక్షానికే స్వాగతం యిచ్చుకున్నారుగాని గ్రామ ప్రజలు మొత్తంగా ఎవళ్లకీ స్వాగతం యివ్వనూ లేదు; రెండేసి వేలమంది నాలుగేసి వేలమంది హాజరు కానూలేదు; రౌడీచర్యలని చెప్పుకోతగ్గవి జరగనూ లేదు; ఎవరికీ తలలూ పగలనూలేదు, చెప్పులు విసరనూలేదు; వాలంటీర్ల నినాదాలుతప్ప హాజరైన జనంలో ఎవరూ "మావోటు మీకే యిస్తామని" ఖచ్చితంగా గొంతెత్తి చెప్పనూలేదు.

స్వతంత్ర భారతంలో పార్టీలు,పత్రికలు ప్రజల నెంత స్వతంత్రంగావుపయోగించుకుంటున్నాయ్!

---

కథానిక

# శిథిలాలయంలో—

## "భాస్కరం-ప్రభాకరం"

గదిలోనికి వస్తూనే, "నిజంగా జరిగిన కథచెప్తాను రాసుకోరా" అన్నాడు శేషు.

"అంటే నమ్మాలని నీవుద్దేశ్యం" అన్నాడు టార్జాన్.

"అసలు కథవినండిరా, తరవాత విమర్శించుదురుగాని" అన్నాడు శేషు విసుగ్గా.

"మరి నేవస్తారా, నాకు పనుంది" అని లేవబోయాడు టార్జాన్.

"కూర్చోవోయ్, కథవిని వెళుదుగాని" అని వెంటనే కథ ప్రారంభించాడు శేషు—

* * *

"గోపాలం గతచరిత్ర ఏమంత ముఖ్యమైనది కాదు. స్వతహాగా గోపాలం సరదామనిషి. రెవిన్యూ ఇన్స్పెక్టరు కాగానే పెళ్లాన్ని కాపురానికి తీసుకొచ్చాడు. చీరాలలోవుండగా బుజ్జాయి పుట్టాడు. అక్కడనుంచీ గోపాలం జీవితం మారింది.

బుజ్జాయి అల్లరి అలివిమాలిన అల్లరి. తెల్లటి బుగ్గలూ, తొనలుదేరిన వొళ్లూ, ఎంతో ముద్దుగా వుండేవాడు. ఎప్పుడూ నవ్వుతూ వుండేవాడు. ఎత్తుకున్నాక దింపితే గోలచేసేవాడు. ఎప్పుడూ ఎవరో వొకరు ఎత్తుకోవలసిందే.

ఒకనాటిరాత్రి అకస్మాత్తుగా మృత్యుదేవత బుజ్జిగాణ్ణి ఎత్తుకుపోయింది.

ఇంటి కప్పుమీదనుంచి పెద్దతేలు మంచంమీద పడి, పాలుతాగి పడుకున్న బుజ్జిగాడి కుడిపాదం మీద కుట్టింది. బుజ్జిగాడు స్పృహతప్పి పడి